రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని మండల పరిధి గువ్వలచెరువు ఘాట్ మార్గంలో శివాలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గువ్వలచెరువుకు చెందిన రెడ్డిపీర్(24) సాయంత్రం ద్విచక్రవాహనంలో ఘాట్ మార్గంలో వెళ్తుండగా మార్గంమధ్యలో శివాలయం వద్దకు రాగానే.. కడప వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ పరారు అయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సడలుతున్న పట్టు

- టమాట పంటతో దెబ్బ
- తగ్గుతున్న దిగుబడి
- బోసిపోతున్న మార్కెట్





పట్టుగూళ్లు రాక వెలవెలబోతున్న మార్కెట్



మల్బరీ తోట

మదనపల్లె సిటీ : పట్టుపురుగుల పెంపకం(మల్బరీ) పంట గతంలో భారీగా సాగయ్యేది. క్రమేణా తగ్గుతూ వస్తోంది. దీంతో రాష్ట్రంలోనే హిందూపురం తరువాత పట్టుగూళ్ల విక్రయానికి పేరుమోసిన మదనపల్లె ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ బోసిపోతోంది. గత నెల 16 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు 20 రోజులుగా మార్కెట్‌కు గూళ్లే రాలేదు. ఇలాంటి పరిస్థితి మార్కెట్ చరిత్రలోనే ఎన్నడూ లేదు. ఒకప్పుడు నిత్యం 5 టన్నుల పట్టుగూళ్లు వస్తుండగా.. ప్రస్తుతం పూర్తిగా పడిపోయాయి. 20 రోజుల్లో కేవలం నాలుగు రోజుల్లో 900 కేజీలకే పరిమితమైంది. రైతులు లేక మార్కెట్ బోసిపోతోంది.

చనిపోతున్న పట్టు పురుగులు

జిల్లాలో పడమటి ప్రాంతాల్లో రైతులు వాణిజ్యపంట అయిన టమాటను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పంటకు ఎక్కువగా పురుగు నివారణ మందులు అధిక మోతాదులో వాడుతున్నారు. ఎక్కడ టమాట పంట సాగు అవుతుందో.. ఆ ప్రాంతం చుట్టుపక్కల మల్బరీ పంట సాగు చేసిన రైతులకు ఎదురుదెబ్బ తగలుతోంది. పురుగు నివారణ మందులు పిచికారి చేయడం వల్ల.. అవి వాతావరణంలో కలిసిపోయి షెడ్లలోకి వెళ్లి పట్టు పురుగులు చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో మల్బరీ పంటకు టమాటతో ఎదురు దెబ్బతగులుతోంది. అలాగే ఇటీవల ఆకుముడత తెగుళ్లు, నచ్చురోగం కారణంగా కూడా గూళ్లు రాలేదని రైతులు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 30 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తుండగా.. ఇప్పుడు 8 వేల ఎకరాలకు పడిపోయింది.

బైలోల్టిన్ రకం కోరుతున్న రీలర్లు

మదనపల్లె ప్రాంతంలో మల్బరీ రైతులు ఎక్కువగా క్రాస్ బ్రీడ్ (సీబీ రకం) పట్టుగూళ్లను పెంచుతున్నారు. డివిజన్ పరిధిలోని 15 మండలాల్లో ఒక్క రామసముద్రం మండలం మినహా మిగిలిన 14 మండలాల్లో సీబీ రకం గూళ్లు ఉత్పత్తి చేస్తున్నారు. రీలర్లు మాత్రం బైలోల్టిన్ రకం పట్టుగూళ్లు అయితే పట్టుదారం తెగిపోకుండా ఎక్కువ మొత్తంలో వస్తుందని అంటున్నారు.

మార్కెట్ పరిస్థితి అగమ్యగోచరం

మదనపల్లె ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ ఒకప్పుడు రాష్ట్రంలోనే పేరు మోసింది. ఇక్కడికి నాలుగు జిల్లాల నుంచి రైతులు పట్టుగూళ్లను విక్రయానికి తీసుకువచ్చే వారు. మారిన పరిస్థితులతో మార్కెట్‌కు తక్కువగా విక్రయానికి వస్తున్నాయి. ఈ మార్కెట్‌పై ఆధారపడి మల్టీ ఎండ్ రీలింగ్ మిషన్‌లు పెట్టుకున్న రీలర్లు, వారి అనుసంధానంగా పని చేస్తున్న కార్మికులు అయోమయంలో పడిపోతున్నారు. ఇలాగే కొనసాగితే మార్కెట్ మూతపడే పరిస్థితి ఎదురవుతుందని పలువురు అంటున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తాం



పట్టుగూళ్ల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తాం. ప్రభుత్వ పథకాల గురించి వివరించి పంట సాగు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తాం. టమాట పంటలకు దూరంగా మల్బరీ సాగు చేయాలని సూచనలు ఇస్తున్నాం. నచ్చురోగం వల్ల గూళ్లు దెబ్బతింటున్నాయి. ఈ నెల నుంచి గూళ్లు బాగా వస్తాయని అనుకుంటున్నాం. – పి.రామమోహన్, సిరికల్చర్ ఏడీ, మదనపల్లె.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



ఎస్‌కేఆర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ సునంద

సిద్దవటం : మండలంలోని మిట్టపల్లి, ఎస్‌కేఆర్ నగర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని కడప అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ సునంద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఎస్‌కేఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని ఆహార పదార్థాలను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పోషకాహార మాసోత్సవాల్లో నిత్యావసర సరుకులతో అంగన్‌వాడీ వర్కర్‌లు నిర్వహించిన మాసోత్సవాల లోగోను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్ శ్రీవిద్య, అంగన్వాడీ వర్కర్‌లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు గ్రామం యనాదికాలనీలో గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. విషయం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన ప్రత్యేక నిధులతో గ్రామానికి సోమవారం బోరు వేయించారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే 'చెకుముకి'



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిద్దవటం: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ పరీక్షలు ఉపయోగపడుతాయని మండల విద్యాధికారి విలియంరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జేవీవీ మండల శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రాలను ఎంఈఓ విలియంరాజు, ఎంఈఓ–2 అరుణ ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సమీర్‌బాషా మాట్లాడుతూ ఈ చెకుముకి పోటీ పరీక్షలు పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న, మండల స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 27, రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

రామాపురం : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని లక్కిరెడ్డిపల్లె సీఐ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ పండుగ భక్తి భావంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పోలీసుల సూచనలు విధిగా పాటించాలన్నారు.



ఉత్సవ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న లక్కిరెడ్డిపల్లె సీఐ వెంకటకొండారెడ్డి

ఇంటి పట్టాల పంపిణీ మళ్లీ వాయిదా

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల పునరావాసం కోసం సంకల్పించిన ఆర్‌ఆర్–5 ఇంటి పట్టాల పంపిణీ మళ్లీ వాయిదా పడింది. మొదట్లో ఈ నెల 2న ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. అప్పుడు పంపిణీ జరగలేదు. తరువాత శుక్రవారం ఆర్‌ఆర్–5లో గ్రామస్తులకు పట్టాలను జిల్లా మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని ప్రకటించారు. తీరా ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ మళ్లీ వాయిదా వేశారు. ఇలా రెండు సార్లు వాయిదా పడింది. ఆర్‌ఆర్–5లో ఏర్పాట్లు చేసి పంపిణీ చేపట్టకపోవడంపై గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటి పట్టాల పంపిణీ కోసం చేసిన ఏర్పాట్లు

దోమలను అరికట్టి వ్యాధులను నివారిద్దాం

సంబేపల్లె : ఫ్రైడే డ్రైడేగా పాటించడం వలన దోమలను అరికట్టి కీటక జనిత వ్యాధులను నివారించవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారులు ప్రసాద్, జయరాములు పేర్కొన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రామాలయం వీధి సమీపంలో ఉన్న డ్రైనేజీ కాలువను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్నచోట అబేట్ చల్లారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిలో పెరుగుతున్న దోమలను వెంటనే తొలగించాలని వారు వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహమ్మద్‌ఖాన్

మదనపల్లె : కుటుంబ కలహాలతో భార్య కాపురానికి రాలేదన్న కారణంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. బసినికొండ పంచాయతీ పుంగనూరు రోడ్డు ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద నివాసమున్న హైదర్‌వల్లి కుమారుడు మహమ్మద్‌ఖాన్ (23) భవన నిర్మాణ కార్మిక మేస్త్రీగా పని చేస్తున్నాడు. వివాహం అయిన తరువాత భార్య షబ్రీన్‌తాజ్‌తో కలిసి వేరు కాపురం పెట్టాడు. ఇటీవల ఆమె గర్భం దాల్చి పుట్టింటికి వెళ్లింది. అయితే మహమ్మద్‌ఖాన్ తల్లి అనారోగ్యానికి గురికావడంతో వెళ్లి పరామర్శించి వచ్చాడు. ఈ విషయమై మహమ్మద్‌ఖాన్‌తో భార్య గొడవ పడింది. తరువాత ఫోన్ చేసి ఇంటికి రావాల్సిందిగా భర్త కోరినా తిరస్కరించింది. దీంతో మనస్తాపం చెందిన మహమ్మద్‌ఖాన్ శుక్రవారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కూడా పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల కోసం ఆర్‌ఓ వాటర్ ప్లాంటును మండల విద్యాశాఖాధికారులు రమాదేవి, శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు కలుషిత నీరు తాగి వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆర్‌ఓ ప్లాంటును మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, స్కూల్‌కమిటీ చైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న నాయకులు

గాలివీడు : మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం వడిసెలవంకలో నిర్వహించిన వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంటు విజేతలకు మాజీ ఎంపీపీ గల్లా సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యదభూషన్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, సర్పంచ్ దీప్తి వెంకటాద్రి, హరీష్‌కుమార్‌రెడ్డి, ఉమాప్రభాకర్, నాయకులు చింతంరెడ్డి రామాంజులరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఐ.వెంకట రమణారెడ్డి, రమణారెడ్డి, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలలో పాటూరు విద్యార్థుల ప్రతిభ

నందలూరు : కావలిలో ఈనెల 5న జరిగిన అంతర్ జిల్లా (రాష్ట్రస్థాయి) 3ఏ సైడ్ వాలీబాల్ అసోసియేషన్ అండర్–14 బాల బాలికల పోటీలో మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారు. విజయం సాధించిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు నిర్వాహకులు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న టీచర్లు

ఏయూలో 'ఏఐ'పై అవగాహన సదస్సు

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్‌పై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏఐటీఎస్ ప్రిన్సిపల్ నారాయణమాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ఇప్పుడు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాలానికి అనుగుణంగా విద్యార్థులు టెక్నాలజీ మారాలన్నారు. విద్యార్థులు ఏఐపై అవగాహనతోనే భవిష్యత్తులో రాణించగలరన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ డా.సుబ్బారావు, కో–ఆర్డినేటర్ నవీన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



జి.శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయచోటి



ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాయచోటి టౌన్ : సకలా దేవతాగణములకు అధిపతి వినాయకుడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డిలు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఆది అంతం లేని ఆనందమయతత్వమూర్తి, బుద్ధికి, సిద్ధికి నాథుడని, సకల విఘ్నాలకు అధినాయకుడని అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. చదువుకు, విజ్ఞానానికి, విజయానికి సకల కార్యములను నెరవేర్చే విధాత వరసిద్ధి వినాయకుడేనన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఆయురోగ్యాలతో సంతోషంగా వినాయక చవితి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. మట్టి వినాయకుడిని ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దజంగంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లం ఉపాధ్యాయులుగా పని చేస్తున్న దేవప్రసాద్‌రెడ్డి, మురళీకుమార్‌లను ఆయా పాఠశాల సిబ్బంది శుక్రవారం సన్మానించారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులచే ఉత్తమ అవార్డును అందుకోవడం చాలా ఆనందకరమని తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారిని సత్కరించారు.

గణపయ్య పండుగ.. ఊరూరా వేడుక

- ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- పూజలకు గ్రామాలకు తరలిన గణనాథులు



వీరబల్లి: మాట్లాడుతున్న ఎస్ఐ మోహన్ నాయక్



సుండుపల్లి: మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేస్తున్న మానవత సభ్యులు



రాయచోటి: మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



పుల్లంపేట: తయారు చేసిన మట్టి వినాయకుడికి పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సంబేపల్లె: ఉత్సవ నిర్వహణకు గణనాథుని ట్రాక్టర్‌లో తరలిస్తున్న నిర్వాహకులు



రాయచోటి టౌన్: వినాయకుడి ప్రతిమలను అందజేస్తున్న సీఐ చంద్రశేఖర్

రాయచోటి టౌన్ : వినాయక చవితి పండుగ అంటే గ్రామాలలో సందడే సందడి. గ్రామాలలో యువకులు ఒక కమిటీగా ఏర్పడి పెద్ద పెద్ద గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించి తొమ్మిరోజులు పూజలు నిర్వహించి చివరి రోజు నిమజ్జనం చేస్తారు. ఈ పండుగ రోజుల్లో గ్రామాలలో సందడి సందడిగా ఎంతో సంతోషంగా నిర్వహిస్తారు.

మట్టి ప్రతిమలనే పూజించండి

– అర్బన్ సీఐ చంద్రశేఖర్, రాయచోటి

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రజలకు సూచించారు. శుక్రవారం రాయచోటి మానవత సేవా సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, మానతవ సేవా సంస్థ ఆధ్వర్యంలో సీఐ చంద్రశేఖర్ బాలికోన్నత పాఠశాలలో మట్టి వినాయకుడి ప్రతిమలను ప్రజలకు అందించారు. అలానే రాయచోటి మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా రాయచోటి ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు.

రామాపురంలో..

రామాపురం : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణనాథులు ప్రతిమలను గ్రామాలలో కొలువు తీరుటకు గ్రామాలకు తరలిస్తున్నారు. కడప – రాయచోటి తదితర పట్టణ ప్రాంతాల నుంచి భారీ గణనాథులు ప్రతిమలను భారీ వాహనాలలో తరలిస్తున్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో వందకు పైగా గణనాథుని ప్రతిమలు పూజలందుకోనున్నాయి.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం

సుండుపల్లె : మానవత సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణానికి హాని లేకుండా మట్టి వినాయక విగ్రహాలను మండల ప్రాథమిక పాఠశాలలో ఉచితంగా గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు.

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో వెలసి ఉన్న నూతన వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం తలమంచి గిరీష్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆకుల చిన్న, జీఎస్ ప్రసాద్, యానాది నాయుడు, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలో 78 వినాయక విగ్రహాలను ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్టు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు.

వీరబల్లి : మండలంలో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఉత్సవ నిర్వాహకులతో ఎస్ఐ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ వినాయక చవితి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, మద్యం సేవించి బొమ్మ దగ్గర అల్లర్లు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంబేపల్లె : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వినాయకుని ప్రతిమల ఏర్పాటు కోసం చలువపందిళ్లు, షామియానాలు, విద్యుత్ దీపాలతో మండపాలను అలంకరించారు. గణేశుని విగ్రహాలను తీసుకొచ్చేందుకు వాహనాలను సిద్ధం చేసుకున్నారు.

పుల్లంపేట : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కృష్ణంపల్లిలో విద్యార్థులు మట్టితో బుజ్జి గణనాథులను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సివి రమణమూర్తి, ఉపాధ్యాయుడు ఎస్.విశ్వనాథ్‌లు విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం నివారణకు అందరూ మట్టి వినాయకుడినే పూజించాలని కోరారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను గ్రామస్తులకు అందజేశారు.

రాయచోటి : రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట సుగవాసి రాజారాం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు పర్యావరణ అనుకూల వినాయక విగ్రహాలను తయారు చేసి తోటి విద్యార్థులకు పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు శెట్టం ఆంజనేయులు సారథ్యంలో మట్టి విగ్రహాలను విద్యార్థులు తయారు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షించడం అందరి బాధ్యత అన్నారు. పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.





ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయం

- తలమంచి గిరీష్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పెనగలూరు అభివృద్ధి
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి



తలమంచి గిరీష్ రెడ్డి

పెనగలూరు : ప్లాస్టిక్ రహిత సమాజమే తన ధ్యేయమని తలమంచి గిరీష్ రెడ్డి ట్రస్ట్ అధినే తలమంచి గిరీష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం పంచాయతీ పి.కొత్తపల్లెకు చెందిన గిరీష్‌రెడ్డి గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుసాగుతున్నట్టు తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పది లక్షల మొక్కలు నాటి, వాటిని సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలానే పెనగలూరును ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ట్రస్ట్ సహకారం అందిస్తుందన్నారు. ఇప్పటికే ట్రస్ట్ ఆధ్వర్యంలో పి.కొత్తపల్లె గ్రామంలో రూ.20లక్షలతో వినాయక స్వామి మండపం, రూ.40లక్షలతో కోనేరును నిర్మించినట్టు తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా ట్రస్ట్ ద్వారా సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ట్రస్ట్ ద్వారా మొక్కలు పంపిణీ చేపడతామని, ప్లాస్టిక్ రహిత పెనగలూరును తీర్చిదిద్దడంలో అందరూ సహకారం అందించాలని కోరారు.



ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన వెంగంతాత కోనేరు



పి.కొత్తపల్లెలో నిర్మించిన వినాయక మండపం

ఆలయానికి విరాళం

గాలివీడు : కోదండ రామాలయానికి దేవిరెడ్డి గీతా రూ.57,116 విరాళంగా అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయ రాజగోపురం ప్రారంభోత్సవం సందర్భంగా రాయచోటి వీరభద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి డి.వి రమణారెడ్డి సతీమణి దేవి రెడ్డి గీత గోపుర కలశాల ఏర్పాటుకు విరాళం అందించినట్లు తెలిపారు.

గ్రామంలో పారిశుధ్య పనులు



బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని నేకనాపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి అధ్యక్షతన వినాయక చవితి పండుగను పురస్కరించుకొని శుక్రవారం గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో చెత్తా, చెదారం, మురుగు నీరును తొలగించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్లీచింగ్ చల్లించారు.

















